క్లుప్తంగా

పట్టణ ఎస్‌ఐగా ఖాదర్ బాషా



మంగళగిరి: పట్టణ ఎస్‌ఐగా ఖాదర్ బాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పట్టణ ఎస్‌ఐగా విధులు నిర్వర్తించిన మహేంద్ర దుగ్గిరాల ఎస్‌ఐగా బదిలీ కాగా ఆయన స్థానంలో ఖాదర్ బాషా గుంటూరు సీసీఎస్ నుంచి మంగళగిరి పట్టణ ఎస్‌ఐగా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది నూతన ఎస్‌ఐ ఖాదర్ బాషాకు అభినందనలు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం



మంగళగిరి: నూజివీడు నుంచి నెల్లూరు జిల్లాకు అక్రమంగా తరలివెళుతున్న రేషన్ బియ్యం లోడు లారీని మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధి కాజ టోల్‌ప్లాజా వద్ద సోమవారం రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. లారీలో 620 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని మంగళగిరి రూరల్ స్టేషన్‌కు తరలించినట్లు పౌరసరఫరాల శాఖ డీటీ దుర్గారావు తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ ఎస్పీ ఈశ్వర్, సీఐ శ్రీహరి పాల్గొన్నారు.

రేపు గౌతమ బుద్ధా రోడ్ ప్రారంభం

మంగళగిరి: నగరంలోని ప్రధాని రహదారి గౌతమ బుద్ధా రోడ్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈనెల 6వ తేదీన ఈ రహదారిని ప్రారంభించేందుకు అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ప్రత్యేక చొరవతో సుమారు రూ.12 కోట్ల నిధులతో ఈ రహదారి విస్తరణ పనులు చేపట్టగా ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. ఈనేపథ్యంలో ఈనెల 6న గౌతమ బుద్ధా రోడ్‌ను ప్రారంభించేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. సోమవారం ఎమ్మెల్యే ఆర్కే నగర పాలక సంస్థ అధికారులతో కలసి గౌతమ బుద్ధా రోడ్ విస్తరణ పనులను పరిశీలించారు. చినకాకాని ఎన్నారై ఆసుపత్రి సమీపంలో నిర్మిస్తున్న గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని, ఏపీఐఐసీ సర్కిల్ వద్ద దివంగత నేత, మాజీ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే తెలిపారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పల్స్‌పోలియోపై ఇంటింటి సర్వే

ఫిరంగిపురం: మండలంలోని పలుగ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది సోమవారం పల్స్‌పోలియో చుక్కలు వేయించుకున్న వారి వివరాలు ఇంటింటికి తిరిగి సేకరించినట్లు వైద్యాధికారులు ఫరీనాబేగం, ఎస్తేరురాణి తెలిపారు. పోలియో చుక్కలు వేయించుకున్నవారి ఇంటికి బయట పి గుర్తు నమోదు చేశారన్నారు. వేయించుకోని వారి ఇంటికి ఎక్స్ గుర్తును నమోదు చేసి వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు హాజీ అహ్మద్ చారిటబుల్ ట్రస్ట్ –కోవిడ్ ఫైటర్స్, గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం 85 మంది విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు, పరీక్ష అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి రాజీవ్ రత్న, చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి అబ్దుల్ రెహ్మాన్, కోవిడ్ ఫైటర్స్ ప్రతినిధి అల్లా భక్షు, ఉపాధ్యాయులు బి. శ్రీనివాసరావు, రాజారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురు అరెస్ట్

తెనాలిరూరల్: గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. స్థానిక త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ ఎం.రమేష్ వివరాలు వెల్లడించారు. తెనాలి పట్టణం నుంచి బాపట్ల జిల్లా చుండూరు మండలం చినపరిమి గ్రామానికి వెళ్లే డొంక రోడ్డులో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు నేతృత్వంలో ఎస్‌ఐ నక్కా ప్రకాశరావు, ఏఎస్‌ఐ షేక్ హైదర్ అలీ, పీసీలు పి.మురళి, ఎం.అంకయ్య, శ్రీహరి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఐదుగురు వ్యక్తులు గంజాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నట్టు గుర్తించారు. పోలీసుల రాకను పసిగట్టిన నిందితులు పరారయ్యేందుకు ప్రయత్నించారు. పోలీసులు వెంటపడగా నలుగురు పట్టుబడ్డారు. వీరిని సంగంజాగర్లమూడికి చెందిన మహమ్మద్ అబ్దుల్ రషీద్, తెనాలి నందులపేటకు చెందిన కోటి సాయిమంజునాథ్, దేవరకొండ మను శివ శంకర్, బుర్రిపాలెం రోడ్డు బీసీ కాలనీకి చెందిన కోట సురేంద్రలుగా గుర్తించారు. వీరి వద్ద నుంచి చిన్న చిన్న పొట్లాల్లో ఉంచిన 1.20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నర్సీపట్నం వెళ్లి గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చి ఇక్కడ అధిక ధరకు విక్రయిస్తున్నారని పోలీసుల విచారణలో వెల్లడైంది. పరారైన నిందితుడి కోసం గాలిస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు.

అవధుల్లేని ఆనందం



ఇళ్ల స్థలాల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో పాల్గొన్న అక్కా చెల్లెమ్మలు



పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు , ఎమ్మెల్యే ఆర్కే

- దుగ్గిరాలలో పండుగ వాతావరణం
- ప్రభుత్వంలో మహిళలకు ప్రాధాన్యం
- మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కూడా బీసీ మహిళే
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణా రెడ్డి (ఆర్కే)

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కా చెల్లెమ్మలకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో నిర్మించిన ఇళ్లకు గతంలో పట్టాలను అందజేశారు. ప్రస్తుతం ఆ పట్టాలను లబ్ధిదారుల పేరుమీద రిజిస్ట్రేషన్ చేసి సోమవారం అందజేశారు. స్థానిక మార్కెట్ యార్డులో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ హాజరయ్యారు. దుగ్గిరాల మండలంలోని 18 లే అవుట్లలో 2,732 మంది లబ్ధిదారులకు పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) మాట్లాడుతూ కొంతమంది ప్రతిపక్ష నాయకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అవాస్తవాలు ప్రచారం చేస్తూ ప్రజలకు, అభివృద్ధి ఏమీ చేయలేదని చెబుతున్నారని ఆరోపించారు. అలాంటి వారికి జగనన్న ప్రతి ఇంట్లో అందజేసిన సంక్షేమ పథకాలు వివరించడంతో పాటు జరిగిన అభివృద్ధిని వివరించి మేము జగనన్నకే ఓటు వేస్తామని ధైర్యంగా చెప్పాలని సూచించారు. జగనన్న భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టని సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఇందిరమ్మ ఇళ్ల కింద పేదలకు 50 లక్షల ఇళ్లు నిర్మించి అందజేస్తే, ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తరువాత నవ్యాంధ్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 35 లక్షల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించుకునేందుకు నగదును అందజేశారని వివరించారు. ప్రతి అక్క చెల్లెమ్మకు ఆస్తి ఉండాలని, రాబోయే కాలంలో అవసరాల నిమిత్తం బ్యాంకు లోన్లు తీసుకునేవిధంగా ఆలోచించి రూపాయి ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ ఆఫీస్‌ల చుట్టూ తిరగకుండా, లంచాలు ఇవ్వకుండా రిజిస్ట్రేషన్ చేసి ఆ పత్రాలను మీకు అందజేస్తున్నారని వెల్లడించారు. మహిళలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి చట్టసభల్లో మాట్లాడే విధంగా ఆయన ప్రణాళిక సిద్ధం చేశారని చెప్పారు. అందులో భాగంగానే మంగళగిరి ఓసీ అభ్యర్థి అయిన తనను కాదని బీసీ అభ్యర్థి అయిన మురుగుడు లావణ్యకు సీటు కేటాయించారని వివరించారు. లావణ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించి మరోసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. మొత్తం 2732 మందికి అందించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, , తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ భార్గవి, హౌసింగ్ డీఈ రామమోహనరావు, సర్పంచులు బాణావత్ ఖుషీబాయి, ఉన్నం యూస్సీరాణి, యార్లగడ్డ శ్రీ చంద్ర దుర్గాభవాని, ఇత్తడి రమేష్, దాసరి సుందరమ్మ, కొండూరు సుధారాణి, పలుకూరి మేరిరాణి, షేక్ అజీజున్, బి. శ్రీనివాసరెడ్డి, గంపల గంగాధరరావు, వైఎస్సార్ సీపీ దుగ్గిరాల మండల అధ్యక్షుడు ఎస్.రత్నం, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు(డీవీఆర్), వి.రజనీకాంత్ పాల్గొన్నారు.

గ్రామాల వారిగా ఇళ్ల పట్టాలు పొందిన లబ్దిదారులు

చిలువూరు గ్రామంలో	412,	గొడవర్రు	53,	పెనుమూలి	153
చినపాలెంలో	10,	కంఠంరాజు కొండూరు	66,	పెరుకలపూడి	145
చింతలపూడి	26,	మంచికలపూడి	81	రేవేంద్రపాడు	260
చుక్కపల్లివారి పాలెం	82,	మోరంపూడి	112	శృంగారపురం	76
దుగ్గిరాల	515,	పెదకొండూరు	107	తుమ్మపూడి	80
ఈమని	389,	పెదపాలెం	135	వీర్లపాలెం	30

పేద ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



లబ్ధిదారునికి సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: రాష్ట్రంలోని నిరుపేద ప్రజల ఆరోగ్యంపై సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉన్నారని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అన్నారు. సోమవారం నగరంలోని ఆటోనగర్ తన కార్యాలయంలో రూ.35 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను 52 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ఎంతో మంది పేద ప్రజలకు వరంగా మారిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఆకురాతి రాజేష్, సంకె సునీత పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో రాజకీయ ఫిర్యాదులు పరిశీలించాలి



రాజకీయ పార్టీ నేతలతో సమావేశం నిర్వహిస్తున్న ఈఆర్‌ఓ లక్ష్మీకుమారి

మంగళగిరి: గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి అందిన అర్జీలు, ఫిర్యాదులను వెంటనే క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఈఆర్‌ఓ లక్ష్మీకుమారి పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈఆర్‌ఓ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశాల్లో అందించిన ఫిర్యాదులు, అర్జీలను క్రమపద్ధతిలో రికార్డు చేసి, క్షేత్రస్థాయి పరిశీలనకు బీఎల్‌ఓలకు పంపాలని ఆదేశించారు. ఆయా పోలింగ్ బూతుల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు, ఎన్నికల డీటీ దరియావలి పాల్గొన్నారు.

జిల్లా పవర్ లిఫ్టింగ్ జట్టు ఎంపిక



క్రీడాకారులతో విజయభాస్కరరావు, సంధానీ

మంగళగిరి: గుంటూరు జిల్లా సీనియర్ మెన్, ఉమెన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే సంధానీలు తెలిపారు. సోమవారం నగరంలోని ఫిట్‌జోన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. పురుషుల విభాగంలో హెచ్ రమేష్ శర్మ (గుంటూరు), వై హర్షవర్ధన్ (తెనాలి), ఎల్ దినేష్ (గుంటూరు), ఎస్‌కే అష్రాఫ్ అలి (గుంటూరు), రామ్ కుమార్ (మంగళగిరి), ఎస్ కౌశిక్ (తెనాలి), జి రాజాదత్తు (గుంటూరు), పి దేవేందర్‌రెడ్డి (తెనాలి), ఎం.అభిషేక్ (గుంటూరు) లను ఎంపిక చేసినట్లు తెలిపారు. అదే విధంగా మహిళల విభాగంలో ఎం షానున్ (తెనాలి), వి.రేవతి (తెనాలి), ఈఎల్ వినయ్‌శ్రీ (తెనాలి), ఎన్ నాగదివ్య (తెనాలి), బి.చంద్రిక (మంగళగిరి)లు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన గుంటూరు జిల్లా సీనియర్ మెన్, ఉమెన్ పవర్ లిఫ్టింగ్ జట్టు ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన విశాఖపట్టణంలో జరిగే ఏపీ సీనియర్ మెన్, ఉమెన్ పవర్ లిఫ్టింగ్ క్లాసిక్ ఎంపిక పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. మెన్ టీం జట్టుకు కోచ్‌గా ఎస్‌కే సంధానీ, మేనేజర్‌గా గుమ్మడి వెంకటేశ్వరరావు, ఉమెన్ టీం కోచ్‌గా కొమ్మాకుల విజయభాస్కరరావు, మేనేజర్‌గా ఘట్టమనేని సాయి రేవతిలు వ్యవహరించనున్నట్లు తెలిపారు.

ఏసీసీ ఫ్యాక్టరీ భూములను కాపాడాలి



భూములను పరిశీలిస్తున్న కార్మికులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీకి చెందిన భూములను కార్మికులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులు కూరపాటి స్టీవిన్, ఆదినారాయణ మాట్లాడుతూ సిమెంట్ కంపెనీకి చెందిన భూములను అన్యాయంగా అమ్మకాలు సాగిస్తున్నారని ఆరోపించారు. హద్దు రాళ్లు వేసి భూములను దొడ్డిదారిన రిజిస్ట్రేషన్ చేస్తున్నారని అన్నారు. సాయిబాబా గుడి ఉన్న ప్రాంతంలో భూములను కూడా అమ్మి హద్దులు వేశారని, ఏసీసీ భూములకు సంబంధంలేని వ్యక్తులు చొరబడి భూములను అమ్ముకుంటూ వెళితే కార్మికులకు రావలసిన బకాయిలకు ఏసీసీ భూములు ఉండవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి అన్యాక్రాంతమైన భూములను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో వై.యెహోషువా, తుపాకుల నాగేశ్వరరావు, ఎం.ఆశీర్వాదం, ఎమ్మిల చెట్టి పాల్గొన్నారు.

తాడేపల్లిలో పోలీస్ కవాతు



తాడేపల్లిరూరల్: 2024 సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ప్రతిఒక్కరూ సహకరించాలని సోమవారం సాయంత్రం పోలీస్ కవాతు నిర్వహించారు. సీఐ మధుసూదనరావు మాట్లాడుతూ ఎన్నికలు, ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ప్రతి ప్రాంతంలో కవాతు నిర్వహిస్తున్నామని చెప్పారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుంచనపల్లి ప్రాతూరు క్రాస్ రోడ్ నుంచి ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరులో తాడేపల్లి పోలీస్‌స్టేషన్ సిబ్బందితో పాటు సీఐఎస్‌ఎఫ్ సిబ్బందితో కలసి కవాతు నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో తాడేపల్లి ఎస్‌ఐలు రమేష్, ప్రతాప్‌కుమార్ పాల్గొన్నారు.

గుండిమెడలో విద్యార్థుల సర్వే



తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్‌యూ న్యాయ కళాశాల విద్యార్థులు సోమవారం గుండిమెడ గ్రామంలో న్యాయ సమస్యలపై సర్వే నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కేఐ పవన్‌కుమార్ మాట్లాడుతూ వృద్ధులకు పెన్షన్ల పంపిణీలో ఎదురవుతున్న ఆటంకాలు, ఆర్టీసీ బస్సుల అసౌకర్యం, విద్యుత్ సరఫరాలో సమస్యలు, పలువురు భార్యాభర్తల వివాదాలు వంటి పలు రకాల సమస్యలు విద్యార్థుల దృష్టికి వచ్చాయని తెలిపారు. సుమారు 180 మంది విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి పరుచుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల విభాగాధిపతి విజయసుధ, డాక్టర్ కామసాయి, డాక్టర్ పి.శైలజ పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

తెనాలిరూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు కేసులు నమోదు చేశారు. తెనాలి మండలం నందివెలుగు గ్రామంలో ఎస్‌ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇద్దరు వ్యక్తులు మద్యం విక్రయిస్తుండడాన్ని గుర్తించి పరిశీలించారు. ఇద్దరి వద్ద 20 సీసాలు లభించడంతో వాటిని స్వాధీనపర్చుకుని ఇద్దరిపై కేసులు నమోదు చేశారు.

చలపతికి ఏఐఎంఆర్ సొసైటీ అవార్డులు



అవార్డులు అందుకుంటున్న చలపతి కళాశాల అధ్యాపక బృందం

తాడికొండ: ఏఐఎంఆర్ సొసైటీ అవార్డులు చలపతి కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు దక్కించుకోవడంపై విద్యా సంస్థల కరస్పాండెంట్ వై.సుజిత్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సీఎంఆర్ కళాశాలలో అవార్డుల ప్రదానోత్సవం ఇటీవల నిర్వహించినట్లు సోమవారం తెలిపారు. కళాశాలకు రాష్ట్ర స్థాయిలో కమ్యూనిటీ అవుట్ రిచ్ అవార్డును సొంతం చేసుకోవడంతో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్ కుమార్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కిందన్నారు. డీఎస్ విభాగాధిపతి ప్రొఫెసర్ డి.సాయి శ్రీనివాస్‌కు రైజింగ్ స్టార్ ఎడ్యుకేటర్ అవార్డు, కృత్రిమ మేధ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.శాంతిప్రియకు కమ్యూనిటీ సోషల్ ఎంగేజ్ మెంట్ అవార్డు అందుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా అవార్డులు పొందిన ప్రిన్సిపాల్, . అధ్యాపకులను కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు ఘనంగా సత్కరించారు.

ప్రాణకోటి మనుగడకు జీవనాడులు వృక్షాలు



మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: వృక్షాలు ప్రాణకోటి మనుగడకు జీవనాడులని ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం-4 ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ కె.విజయకుమారి పేర్కొన్నారు. ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో లాలుపురంలో చేపట్టిన ప్రత్యేక శిబిరంలో భాగంగా సోమవారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సీహెచ్ పరిమళ మాట్లాడుతూ మొక్కలు నాటి, చెట్లను విరివిగా పెంచడం ద్వారా పచ్చదనం పెంపొందుతుందని తెలిపారు. ఈ సృష్టిలో ప్రతి జీవికీ ప్రాణవాయువును అందించే గొప్ప దాత వృక్షమని చెప్పారు. చెట్లను ఎక్కువగా పెంచడం ద్వారా మానవాళికి కాలుష్యం లేని స్వచ్ఛమైన గాలి, వాతావరణంలో చల్లదనం ఉంటుందని సూచించారు..

పచ్చదనపు ఆవశ్యకత చాటుతూ ...

సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం చేపట్టిన ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా సోమవారం పొన్నూరు రోడ్డులోని ఐపీడీ కాలనీ పరిసర ప్రాంతాల్లో పచ్చదనపు ఆవశ్యకత చాటుతూ స్థానికులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ వివిధ వేడుకల్లో అతిథులకు బహుమతులుగా మొక్కలను ఇవ్వడాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జేవీ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచం మొత్తం కాలుష్యంతో నిండి ఉందని, క్రమంగా భూమి వేడెక్కుతోందని తెలిపారు. ఫలితంగా చర్మ సంబంధిత వ్యాధులు, ఆస్తమా, ఎలర్జీ, శ్వాస సంబంధమైన వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు.

స్టోరేజీ యజమాని నిర్వాకం వల్లే...

- పసుపు రైతులు రూ.115 కోట్ల సంపద కోల్పోయారు
- సబ్‌కలెక్టర్‌కు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర నేతలు వినతి



సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతునేతలు

తెనాలి: దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీ యజమాని నేరపూరిత ఆలోచనతో ఇన్సూరెన్స్ కంపెనీకి డబ్బులు చెల్లించనందున పసుపు రైతులు రూ.115 కోట్ల సంపదను కోల్పోయారని, ప్రభుత్వం కోల్డ్‌స్టోరేజీ యజమానిపై చర్యలు తీసుకోవాలని రైతుసంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, కార్యదర్శి కె.ప్రభాకర రెడ్డి ఆధ్వర్యంలో రైతునేతలు సోమవారం తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌ను కలిసి ఆ ప్రకారం వినతి పత్రం అందజేశారు. మార్కెట్ యార్డు, కోల్డ్ స్టోరేజీ యజమాని ప్రకటించిన జాబితాల్లో రైతుల సంఖ్యలో వ్యత్యాసం ఉందని తెలిపారు. 30 వేల బస్తాల తేడా ఎందుకు వచ్చిందో తెలియక రైతులు గందరగోళ పడుతున్నారని వివరించారు. ప్రభుత్వం స్పందించి ప్రస్తుత మార్కెట్ రేటు క్వింటాలు రూ.13 వేలు ధరను ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు ములకా శివ సాంబిరెడ్డి, బాధిత రైతుల కమిటీ కన్వీనర్ వేములపల్లి వెంకట్రామయ్య పాల్గొన్నారు.

మిర్చి రైతుకు గిట్టుబాటు ధర లభించేలా చూడాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్



సమావేశంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్, యార్డు చైర్మన్ రాజనారాయణ, నేతలు

కొరిటిపాడు(గుంటూరు): ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు సోమవారం గుంటూరు మిర్చి యార్డును సందర్శించారు. యార్డులో నిర్వహిస్తున్న ఉచిత రైతు భోజన శాల, రైతు విశ్రాంతి భవన్‌ను సందర్శించి రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం అందిస్తున్నారా.. విశ్రాంతి భవన్‌లో వసతులు ఎలా ఉన్నాయి.. ప్రస్తుతం మిర్చి ధరలు ఎలా ఉన్నాయి.. గిట్టుబాటు అవుతుందా.. కొనుగోలు చేసిన మిర్చికి ఎన్ని రోజుల్లో డబ్బులు చెల్లిస్తున్నారు.. తదితర వివరాలు రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మిర్చి యార్డు చైర్మన్‌తో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ గుంటూరు మిర్చి యార్డు ఆసియా ఖండంలోనే అతిపెద్ద మార్కెట్ యార్డు అని, నిత్యం వేలాది మంది రైతులు ఏపీ నుంచే కాకుండా తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి యార్డుకు తమ సరుకు విక్రయించుకోవడానికి వస్తున్నారని తెలిపారు. యార్డుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన భోజనంతో పాటు వసతి సౌకర్యం కల్పించాలని సూచించారు. రైతులు తెచ్చే మిర్చి ఖాళీ గోతానికి రూ.25 లు చెల్లిస్తున్నారని, కనీసం ఒక్కో గోతానికి రూ.50లు చెల్లించేలా చూడాలని కోరారు. కమిషన్ వ్యాపారులు మిర్చి అమ్మకాలకు సంబంధించి రైతుల నుంచి రెండు శాతం మాత్రమే కమీషన్ తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండు శాతం మించి అదనంగా కమీషన్ వసూలు చేసే వ్యాపారులను కట్టడి చేయాలన్నారు. మిర్చి పంటకు తెగుళ్లు, అతివృష్టి, అనావృష్టి వల్ల దిగుబడులు భారీ స్థాయిలో తగ్గాయని, రైతులు నష్టపోకుండా వీలైనంత వరకూ మిర్చి ధరలు తగ్గకుండా చూడాలని కోరారు. స్పందించిన యార్డు చైర్మన్ రాజనారాయణ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులకు నాణ్యమైన రుచికరమైన భోజనంతో పాటు ఉదయం పూట అల్పాహారం కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతు విశ్రాంతి భవన్‌లో అన్ని వసతులు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రస్తుతం యార్డుకు సీజన్ కావడంతో ప్రతిరోజు లక్షకు పైగా మిర్చి బస్తాలు వస్తున్నాయని, దీంతో స్వల్పంగా ధరలు తగ్గుముఖం పట్టాయని, ఏదిఏమైనా మిర్చి ధరలు తగ్గకుండా నిలకడగా ఉండే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. యార్డులో మెరుగైన వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన వివరించారు. యార్డును సందర్శించిన వారిలో ఏపీ రైతు సంఘం నాయకులు కొల్లి రంగారెడ్డి, రమేష్ బాబు, వెంకటేశ్వర రెడ్డి, యార్డు అధికారులు శ్రీకాంత్, సుబ్రమణ్యం తదితరులున్నారు.


రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం నడిగడ్డపాలెం రైల్వే గేటు సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని సోమవారం పరిశీలించారు. సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతదేహం నుజ్జునుజ్జయ్యింది. పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా 'అవగాహన' వ్యవస్థాపక దినోత్సవం

లక్ష్మీపురం: బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని పద్మావతి కల్యాణ వేదికపై సోమవారం అవగాహన సంస్థ 33వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ నగర ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడంలో అవగాహన సంస్థ కృషి ఆదర్శనీయమని తెలిపారు. విద్యావేత్త ఆర్.రాము మాట్లాడుతూ అవగాహన లాంటి సంస్థలు నేటి పరిస్థితుల్లో చాలా అవసరమని చెప్పారు.

రేపు చలపతి ఫార్మసీలో జాతీయ స్థాయి సదస్సు



గుంటూరు రూరల్: భారతదేశ ఫార్మసీ పితామహుడు ప్రొఫెసర్ మహ దేవలాల్ ష్రాఫ్ జయంతి పురస్కరించుకుని చలపతి ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు ఈ నెల 6న ఫార్మా అన్వేషన్ 2024 జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. సోమవారం నగర శివారులోని లాం నందున్న కళాశాలలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫార్మా అన్వేషన్ కార్యక్రమంలో వివిధ పారిశ్రామిక వేత్తలు, ఫార్మా నిపుణులు పాల్గొంటున్నారన్నారు. చెన్నైకి చెందిన సీఎల్ బైద్‌మేత్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ గురుప్రసాద్ మెహతా మాట్లాడుతూ భారతదేశంలో ఫార్మా విద్య, వృత్తి స్థితిని పెంచటం, నియంత్రించటం, ఏకరూప విద్య, శిక్షణ, ఉపాధి యోగ్యత, ఆరోగ్య సవాళ్లు, అభివృద్ధి, పరిశోధన, విద్యార్థుల నైపుణ్యాలు, జాతీయ విద్యా విధానం ప్రకారం ప్రస్తుత పాఠ్యాంశాల పునర్ నిర్మాణం తదితర అంశాలకు ఇది మంచి వేదిక కానుందన్నారు. విద్యార్థులంతా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.